క్లుప్తంగా

పత్తికొండ ఆర్డీఓగా ఎన్.రామలక్ష్మి



పత్తికొండ రూరల్ : పత్తికొండ రెవెన్యూ డివిజనల్ అధికారిణిగా నీలపు రామలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. వైజాక్‌లో నివాసం ఉంటున్న పవర్ గ్రిడ్ రిటైర్డు మేనేజర్ వెంకటేశ్వరరావు, పార్వతిల కుమార్తె నీలపు రామలక్ష్మి 2022లో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్స్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించి ఆర్డీఓ పోస్టుకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ సృజనను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం పత్తికొండకు చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎల్లార్తి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు

హొళగుంద: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఎల్లార్తి షేక్ షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలతో పాటు రాత్రి నిద్రి చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చినిగితాతా దర్గాల్లో కూడా భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేసి చక్కరను నైవేద్యంగా సమర్పించారు. హొళగుంద సాయిబాబా ఆలయంలో కూడా భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. సాయి సేవక్‌లు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోయిలకొండలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగానికి కొలతలు వేస్తున్న అధికారులు

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామ పొలాల్లో గురువారం మండల గణాంకాధికారి జానకీబాయి ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాన్ని చేపట్టారు. కాగా వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎర్ర భూముల్లో వేరుశనగతో పాటు పత్తి, ఆముదం పంటలు కూడా తక్కువ దిగుబడులు వస్తున్నాయన్నారు. అయితే ప్రతి పంటను మూడు ఏరియాల్లో కోత ప్రయోగం చేసి సరాసరి దిగుబడి గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. సాధారణంగా వేరుశనగ ఎకరాకు 500కేజీలు రావాల్సి ఉండగా ఇక్కడ 350 కేజీల వరకు వస్తోందని చెప్పారు.

వీఆర్వో అదృశ్యం



వీఆర్వో లక్ష్మినారాయణ రెడ్డి

ఆలూరు రూరల్: మండలంలోని హులేబీడు గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి అదృశ్యమైనట్లు అతని కుమారుడు తరుణ్ కుమార్ పోలీసుకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరు పట్టణంలోని ఎల్లార్తి రోడ్డులో ఉన్న ఎల్ఐసీ ఆఫీసు వెనుక నివాసం ఉంటున్న వీఆర్వో లక్ష్మీనారాయణ రెడ్డి ఈ నెల 9న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకి లభించకపోవడంతో బుధవారం సాయంత్రం ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ నెల 9వ తేదీనుంచి విధులకు హాజరుకావడం లేదని, 12న కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేశామని తహసీల్దార్ రామాంజినేయులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆలూరు ఎస్‌హెచ్‌ఓ తిరుపాల్ నాయక్ గురువారం విలేకరులకు తెలిపారు.

వాల్మీకి జయంతిని విజయవంతం చేద్దాం

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో ఈ నెల 28న జరగనున్న వాల్మీకి జయంతిని విజయవంతం చేద్దామని కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ లక్ష్మీఈశ్వరయ్య, తలారి శంకరయ్య, గోవిందురాజులు, మాధవకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో గత మూడేళ్లుగా వాల్మీకి జయంతి ఉత్సవాలను ఐకమత్యంతో వైభవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. 28న మధ్యాహ్నం వాల్మీకి విగ్రహం ఊరేగింపు ఉంటుందని, అలాగే గ్రామస్తులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అలాగే 28,29 తేదీల్లో రాష్ట్రస్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు బహుమతిగా అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 10 గంటల్లోపు రూ.500లు ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9493686207, 6300364569 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలో ఈ నెల 28న నిర్వహించే వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని వాల్మీకి యువత పిలుపునిచ్చారు. గురువారం యూత్ సభ్యులు తెంబళం సిద్ధప్ప, దిడ్డి తిక్కస్వామి, పెద్యాట శ్రీరంగ, ఐకల్ మల్లికార్జున, మల్లి, రమేష్, మల్లికార్జున, తిమ్మప్ప, కాళింగ. పంపాపతి తదితరులు పల్లెలకు తిరిగి కరపత్రాల పంపిణీ చేపట్టారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య
- కున్నూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన



కున్నూరు శిబిరంలో ఆరోగ్య రక్ష కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య,



పెద్దగోనెహాళ్‌లో పౌష్టికాహార ప్రదర్శన



నందవరంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శివారెడ్డిగౌడ్

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఆ లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య తెలిపారు. గురువారం మండలంలోని కున్నూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ ఉచిత ఆరోగ్యం అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాలలో ప్రైవేట్ ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్యం లభిస్తోందని తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు డాక్టర్లు వచ్చి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్రం, మలేరియా, డెంగీ, దీర్ఘకాలిక వ్యాధులు తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేస్తారని చెప్పారు. అవసరమైన వారికీ ఆరోగ్య నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేసి వారికి మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం డాక్టర్లు కార్తీక్, రుక్సానా, తనుద్‌రెడ్డి, దుర్గా విజయ్‌శ్రీలు 305మంది ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ప్రజారోగ్యానికి రక్ష

నందవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి రక్షగా నిలిచిందని ఎంపీడీఓ దశరథ రామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-3 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శివారెడ్డిగౌడ్, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి పర్యవేక్షించారు. వైద్య శిబిరంలో 1,500 మందికి డాక్టర్లు చికిత్సలు అందించారు. 14 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. డాక్టర్ సౌజన్యలత, డాక్టర్ చంద్రకాంత్ యాదవ్, డాక్టర్ పరిమళ, డాక్టర్ సోఫియా బానును వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శివారెడ్డి గౌడ్, సర్పంచ్ సావిత్రి సన్మానించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికి ఆరోగ్యం

కృష్ణగిరి: జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామాల్లో అందరికీ ఆరోగ్యం అందుతోందని ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. మండల పరిధిలోని లక్కసాగరం గ్రామంలో గురువారం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ పరిధిలోని నాలుగు గ్రామాల పరిధిలోని 483 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో గిడ్డయ్య, కార్యదర్శి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

పత్తికొండ రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎంపీపీ నారాయణదాస్ అన్నారు. గురువారం పత్తికొండలోని సచివాలయం-5 పరిధిలో వైద్యాధికారి అరుణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపునకు ముఖ్యఅతిథులుగా ఎంపీపీ నారాయణదాస్, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సర్పంచు కొమ్ముదీపిక హాజరయ్యారు. రోగులకు కేస్ షీట్స్ పంపిణీ చేసి హెల్త్ క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కవిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దేవనకొండ: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే 'జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గౌరీదేవి అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని పల్లెదొడ్డి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు కళ్యాణ్, అరుణ జ్యోతి, ఉదయ్, పుష్పలత, సీహెచ్ఓ గంగాధర్ 400 మందిని పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి కర్నూలులోని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రెఫర్ చేశారు.

హొళగుంద: సీఎం వైఎస్ జగనన్న పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కొత్తింటి వెంకటరెడ్డి తెలిపారు. గురువారం పెద్దగోనెహాళ్ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో హొళగుంద, గజ్జహళ్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు 401 మందికి వైద్య సేవలందించారు. మెరుగైన చికిత్స కోసం 26 మందిని రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుహాసినమ్మ, తహసీల్దారు హుసేన్‌సాహెబ్, ఎండీ హళ్లి సర్పంచ్ సుధాకర్, ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎంపీడీఓ అల్లాబకాష్ అన్నారు. గురువారం మండలంలోని మూసానహళ్లి గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వైద్యులు 410 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఇందులో 30 మందికి కంటి పరీక్షలు చేసి కంటి అద్దాల కోసం రెఫర్ చేశారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు సోము, పంచాయతీ కార్యదర్శి జిలాన్ వైద్యులు ఉన్నారు.

ఆస్పరి: మండలంలోని డీ కోటకొండ గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 275 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. డాక్టర్లు కల్పన, బాలకృష్ణారెడ్డి, గోపాలం ప్రణయ్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను డాక్టర్ రఘురామిరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీటీ జయలక్ష్మి, కార్యదర్శి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

మసీదపురంలో హెల్త్ క్యాంప్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదపురం గ్రామంలో గురువారం ఎంపీడీవో బంగారమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు హరీష్‌కుమార్, మహేశ్వరప్రసాద్, శ్రీకాంత్, బాస్కర్‌రెడ్డి ప్రజలకు బీపీ, షుగర్, కంటి తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



లక్కసాగరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పత్తికొండలో మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాస్



జగనన్న ఆరోగ్య కిట్టును అందజేస్తున్న వైద్యులు



డీ కోటకొండ శిబిరంలో సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ రఘురామిరెడ్డి



మూసానహళ్ల మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



ఆస్పరిలో గణేష్ మృత దేహానికి నివాళులర్పిస్తున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ఆస్పరి: దేవరగట్టులో చెట్టు విరిగి పడిన ఘటనలో మృతి చెందిన గణేష్ కుటుంబాన్ని ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ భరోసా ఇచ్చారు. గురువారం ఆస్పరికి వచ్చిన ఆమె గణేష్ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది పాల్గొన్నారు.

రేపు శ్రీరంగనాథస్వామి దేవాలయం మూసివేత

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయం ఈనెల 28న చంద్రగ్రహణం ఉండడం వల్ల రాత్రి 8 గంటల నుంచి 29వ తేదీ ఉదయం 7 గంటల వరకు ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ దస్తగిరిగౌడ్ గురువారం తెలిపారు. మళ్లీ ఆదివారం 7:30 గంటలకు సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పారు. గ్రహణ సమయం 28 వతేదీ రాత్రి 1:10 గంటల నుంచి తెల్లవారుజామున 3:20 వరకు వుంటుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

తుగ్గలి : రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పాండురంగరాజు గురువారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీల్లో వాలీబాల్ అండర్-14 విభాగంలో జె కార్తీక్, ఫుట్‌బాల్ అండర్ 14 విభాగంలో పి దీపిక, ఎస్ ఫక్రుద్దీన్, ఫుట్‌బాల్ అండర్ 17 విభాగంలో ఎం పవిత్ర, వి సంతోష్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు విశాఖపట్నం, అరకు, ఎమ్మిగనూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం నరేంద్రప్రసాద్, పీడీ, పీఎంసీ చైర్మన్ నాగరాజు అభినందించారు.

నేడు గొరవయ్యల ఆటలు... దేవదాసీల క్రీడలు

హొళగుంద: మండలంలోని దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి సన్నిధానంలో శుక్రవారం గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. దేవరగట్టు దసరా బన్ని ఉత్సవంలో రెండో ప్రధాన ఘట్టమైన గొరువయ్యల ఆటలను చూడడానికి రాష్ట్ర నలమూలాల నుంచే కాకా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గొరవయ్యలు, గురగొరువయ్యలు, పిల్లగొరవయ్యల నృత్యాలు, బల్లారుకు చెందిన గొరవయ్య గొలుసు తెంపడం ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. సాయంత్రం దేవదాసీలు చేసే నృత్యాలు, అనంతరం వసంతోత్సవం, కార్యక్రమాలు జరగనున్నాయి. అనంతరం కంకణ విసర్జనలో భాగంగా మాళమల్లేశ్వరస్వామి విగ్రహాలు, పల్లకీ ఆలయానికి చేరుతాయి. అక్కడి నుంచి శనివారం విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

భవిష్యత్తు బాగుండాలంటే భయాన్ని వీడాలి



పత్తికొండలోని పోలీసు స్టేషన్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ మురళీమోహన్

పత్తికొండ రూరల్ : భవిష్యత్తు బాగుండాలంటే భయాన్ని వీడాలని సీఐ మురళీమోహన్ విద్యార్థులకు సూచించారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీసుల సేవలు, చట్టాలపై పోలీసు స్టేషన్‌లో అవగాహన కల్పించారు. నేరాలకు దూరంగా ఉంటేనే జీవితం బాగుంటుందని సీఐ తెలిపారు. ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ప్రభుత్వం మహిళల రక్షణకు ప్రత్యేకంగా దిశ చట్టాన్ని తీసుకొచ్చిందని ప్రతి ఒక్కరూ దిశ యాప్ డౌన్‌లోడు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపాల్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఫుడ్డులో కనిపించని గుడ్డు !



గుడ్డు లేకుండా భోజనం చేస్తున్న విద్యార్థులు

మద్దికెర : స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో గురువారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించలేదు. విద్యార్థులకు భోజనంలో గుడ్డు ఇవ్వలేదు. మెను ప్రకారం అన్నం, టమాటా పప్పు, దొండకాయ ఇగురు, ఉడకబెట్టి వేయించిన గుడ్డు, రసం, మజ్జిగ ఇవ్వాల్సి ఉంది. అయితే కేవలం అన్నం, పప్పు మాత్రమే ఇచ్చారు. దసరా సెలవుకు వెళ్లిన విద్యార్థులు చాలా మంది రాకపోవడంతో 20 మంది మాత్రమే వచ్చారు. వారికి కూడా మెనూ పాటించకపోవడం బాధాకరం. అంతేగాక పర్యవేక్షణ చేయాల్సిన ఉపాధ్యాయులు ఒక్కరూ కూడా డైనింగ్ హాలులో కాకుండా ఇతర గదుల్లో ఉండిపోయారు. గతంలో కూడా డిప్యూటీ కలెక్టర్ రమ విద్యాలయాన్ని సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించినప్పుడు మెనూ పాటించకపోవడంతో తీవ్రంగా హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినా వారిలో మార్పు రాలేదు.

ఉపాధి పనులు కల్పించాలి

నందవరం : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) జిల్లా సహాయ కార్యదర్శి సోమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ముగతి గ్రామ సచివాలయం-2 ఎదుట ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటేష్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వర్షా భావ పరిస్థితులతో రైతులకు, వ్యవసాయ కూలీలకు పనులు లేక వలస పోతున్నారన్నారు. వలసల నివారణ నిమిత్తం అధికారులు గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు బుల్లెట్, రమేష్, బీమన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు బిల్లేకల్లుకు మంత్రి రాక

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లులో గ్రామస్తుల సహకారంతో రూ.15లక్షలతో నిర్మించిన ఈద్గాను ప్రారంభించేందుకు శుక్రవారం బిల్లేకల్లుకు కార్మిక శాఖమంత్రి గుమ్మనూరు జయరాం వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య, బిల్లేకల్లు సర్పంచ్ శ్రీను గురువారం తెలిపారు.

28న ఆలయాల మూసివేత

దేవనకొండ : ఈనెల 28వ తేదీన చంద్రగ్రహణం ఉండడంతో మండలంలోని కొలుట్ల చెన్నకేశవస్వామి ఆలయం, గద్దెరాళ్ల మారెమ్మవ్వ ఆలయాలను మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న సాయంత్రం 4 గంటల నుంచి 29వ తేదీన ఉదయం 6 గంటల వరకు ఆలయాలను మూసివేస్తున్నామన్నారు.

నేడు మద్దికెరలో జగనన్న ఆరోగ్య సురక్ష

మద్దికెర : మండల కేంద్రం మద్దికెరలో శుక్రవారం మద్దమాంబ దేవాలయం సమీపానున్న సెంట్రల్ స్కూలులో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్త్ క్యాంప్ ఉంటుందన్నారు.

నేడు తుగ్గలిలో వైఎస్సార్‌సీపీ సమావేశం

తుగ్గలి : 'రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి' అనే అంశంపై తుగ్గలిలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30గంటలకు మాజీ ఎమ్మెల్యే దివంగత తమ్మారెడ్డి స్వగృహంలో ప్రారంభమయ్యే సమావేశానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరు కానున్నట్లు చెప్పారు. నాయకులు, ప్రజా ప్రతి నిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరుకావాలని వారు కోరారు.

గట్టు మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఆలూరు: దేవరగట్టులో బన్నీ ఉత్సవం (కర్రల) సమరంలో మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె. గిడ్డయ్య కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆస్పరి గ్రామానికి చెందిన మాల గణేష్, ఆలూరు మండలం తుంభళబీడు, ఎం.కొట్టాల గ్రామాలకు చెందిన ప్రకాష్, రామాంజనేయులు కుటుంబాలకు రూ 25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేయాలన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్, మండల సీపీఐ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్బీకేలలో ఈ-క్రాప్ ముసాయిదా జాబితా

తుగ్గలి : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 29 వరకు ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామని ఏఓ పవన్‌కుమార్ తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

రేపు కూర్మక్షేత్రంలో గ్రహణపూజ

పత్తికొండ రూరల్: ఆస్పరి మండలం హళిగేర గ్రామంలోని కూర్మక్షేత్రంలో ఈనెల 28న జరగనున్న గ్రహణపూజ కరపత్రాలను భజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, క్షేత్ర సేవకులు ఎజి.నరేష్ విడుదల చేశారు. గురువారం పత్తికొండలోని పురాతన శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వయంభూ శ్రీహరికూర్మ క్షేత్రంలో జరిగే గ్రహణ పూజలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ తాలూకా అధ్యక్షుడు వీరరాజు, న్యాయవాదులు రంగస్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తొలగింపుపై సమగ్ర విచారణ చేపట్టాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఓటర్ల తొలగింపుపై బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని తహసీల్దార్ శివరాముడు ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇంటింటా తిరిగి మృతి చెందిన వారి పేర్లను గుర్తించాలన్నారు. గుర్తించిన ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించేందుకు జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. అలాగే కొత్త ఓటర్ల నమోదుతోపాటు ఫారం-7 లను కూడా స్వీకరించాలని తెలియజేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరాజు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోడౌన్‌ను తనిఖీ చేసిన ఆదోని సబ్ కలెక్టర్



గోడౌన్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక పౌరసరఫరాల గోడౌన్‌ను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న నిత్యావసర సరుకులను, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడౌన్ నుంచి ప్రజలకు అందించే నిత్యావసర సరుకులు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. లారీలకు సంచులను ఎత్తేప్పుడు తుకాలను సరిచూసుకోవాలన్నారు. బియ్యం, బ్యాళ్లు, ఇతర సరుకులను జాగ్రత్తగా పంపిణీ చేయాలని సూచించారు. గోడౌన్‌లో ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ ఆంజనేయులు, డీటీ గురురాజరావు తదితరులు ఉన్నారు.

జల చౌర్యాన్ని అరికట్టండి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ గోవిందరాజులు

చిప్పగిరి: హెచ్‌ఎల్‌సీలో జలచౌర్యాన్ని అరికట్టాలని కోరుతూ చిప్పగిరి సర్పంచ్ గోవిందరాజులు ఆధ్వర్యంలో చిప్పగిరి, దౌల్తాపురం, కుందనగుర్తి తదితర గ్రామాల ప్రజలు ఎంపీడీఓ సీవీ కొండయ్యకు గురువారం వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ జలచౌర్యం కారణంగా తమ గ్రామలకు తాగునీటికి ఆధారమైన కాజీపురం రిజర్వాయర్ వరకు నీరు చేరక నిల్వలు అడుగంటి పోయాయన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వారానికి ఒక సారి మాత్రమే కాలువకు నీటిని వదులు తున్నారన్నారు. వేసవి కాలం తాగునీటి అవసరాన్ని దృష్టిలో వుంచుకొని జలచౌర్యాన్ని అరికట్టి కాజీపురం రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపాలని కోరారు.

విశాఖ ఉక్కుఫ్యాక్టరీని పరిరక్షించుకోవాలి



సంఘీభావం తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షించుకోవడంతో పాటు కడప ఉక్కు ఫాక్టరీ ఏర్పాటుకు విద్యార్థి, యువజన సంఘాలు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు శ్రీరాములు, మహేంద్రబాబు, రంగప్ప, విజయేంద్రలు పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఏ, పీడీఎస్ఓ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు పూనుకోవడం తగదన్నారు. ప్రైవేటీకరించే ఆలోచనను కేంద్రం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు నిరసనగా నవంబర్ 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆయా విద్యార్థి,యువజన సంఘాల నాయకులు రాజీవ్, సురేష్,రాజు, సురేంద్రబాబు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభానికి సిద్ధం

మద్దికెర : మండల కేంద్రం మద్దికెరలో నిర్మించిన సచివాలయం-4 ప్రారంభానికి సిద్ధమైంది. రూ.40 లక్షలతో నిర్మించిన భవనాన్ని త్వరలోనే ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ తాలూరి వెంకటేశ్వరరెడ్డి గురువారం తెలిపారు.

రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం →

